ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

పెద్దతిప్పసముద్రం: ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎస్‌ఐ రవీంద్రబాబు హితబోధ చేశారు. మంగళవారం ఆయన మండలంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్షించారు. కన్నవాళ్లు పిల్లలకు చదువుపై ఒత్తిడి చేయరాదన్నారు. వారికి నైతిక విలువలపై అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్లను మంచికి ఉపయోగించుకోలే గాని సెల్‌ఫోనే ఆధారంగా చేసుకుని నిండు జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. అంతేగాక సైబర్ మోసాలకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రభుత్వం నాడు–నేడు ద్వారా విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించిందని, ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించారు. విద్యలో ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ బుడ్డాబాబు, సీఆర్‌పీ నాగరాజు, ఏఎస్‌ఐ గోపాల్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మానసిక ఆరోగ్యమే మహాబలం


ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యుల అవగాహన ర్యాలీ

మదనపల్లె : మానవునికి అన్నిటికన్నా మానసిక ఆరోగ్యమే మహాబలమని ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి, సైక్రియాటిస్ట్ రాధిక అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో అంతర్జాతీయ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ చొరవతో 1992 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 10న మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుతున్నట్లు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై అవగాహన కలిగించడమే దీని ఉద్దేశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా వందకోట్ల మందికి పైగా మానసిక రుగ్మతలతో జీవిస్తున్నారన్నారు మానసిక ఆరోగ్యం...సార్వత్రిక మానవ హక్కు అనే నినాదంతో ఈ ఏడాది మానసిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక సమస్యలతో ఎవరూ బాధపడనవసరం లేదని, ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకుని దానినుంచి మీరు బయటపడేందుకు సహకరించే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మానసిక సమస్యలు ఉన్నవారు 14416 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేస్తే తక్షణ వైద్యసహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ డాక్టర్.ప్రసాదరాజు, రిటైర్డ్ జైల్ సూపరిండెంట్ లక్ష్మీనారాయణ, వైద్యులు పద్మావతి, అమరావతి, హరగోపాల్, సురేష్‌రెడ్డి, సైకాలజిస్ట్ అలేఖ్య, సామాజిక కార్యకర్త గౌతమి తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కోళ్లబైలు పంచాయతీ అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో ప్రపంచ మానసిక ఆరోగ్యదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హోప్ ఇంగ్లీష్‌మీడియం విద్యార్థుల ఆధ్వర్యంలో కరస్పాండెంట్ డాక్టర్.లారెన్స్ వెలుగుసంస్థకు రూ.10వేలు అందజేశారు.

కబడ్డీ జట్టు ఎంపికలు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గస్థాయి అండర్–14,–17, బాల,బాలికల కబడ్డీ జట్లను ఎంపిక చేశారు. హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకమ్మ, గోపినాథ్‌ల ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఇందులో ఒక్కో జట్టు నుంచి 14 మందిని ఎంపిక చేసినట్లు పీడీ దేవకమ్మ తెలిపారు. అండర్–17 బాల,బాలికల జట్లు ఈనెల 13న చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగే జిల్లా స్థాయి జట్టు ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. పీడీలు రాంబాబు, జలజ, సుధాకర్, అన్సర్, ఉపాధ్యాయులు ఫణీంద్ర, మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





నేడు గర్నిమిట్టలో అన్నదానం

కేవీపల్లె : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ గజ్జెల శృతి తెలిపారు. బుధవారం ఉదయం మండలంలోని గర్నిమిట్టలో కేక్ కట్ చేయడం తోపాటు పేదలకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్

మదనపల్లె : రాజంపేట పార్లమెంటరీ అన్నమయ్య జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన యల్లంపల్లె ప్రశాంత్ నియమితులయ్యారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, మంగళవారం యల్లంపల్లె ప్రశాంత్‌ను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామకపత్రం అందించారు. బీజేవైఎం కార్యకర్తగా, కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కర్నూల్‌జిల్లా యువమోర్చా ఇన్‌చార్జ్‌గా, జిల్లా ప్రధానకార్యదర్శిగా పార్టీలో పలు కీలక బాధ్యతలను ప్రశాంత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ సంస్థాగత నిర్మాణానికి కృషిచేస్తానన్నారు.



